సాక్షి మంచిర్యాల

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఛాయాచిత్రం..

ఛాయాచిత్రం మధురస్మృతులను కలకాలం పదిల పరుస్తుంది. మనిషిలోని భావాలను సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. నేడు 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'పై ప్రత్యేక కథనం. 8లో▸



ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

జిల్లాలోని పాఠశాలల్లో సోమవారం టీఎల్ఎం(టీచర్ లర్నింగ్ మెటీరియల్) మేళాలు నిర్వహించారు. మంచిర్యాలలో నిర్వహించిన మేళాను డీఈవో యాదయ్య సందర్శించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /24.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

నష్టం మిగిల్చింది..!

పచ్చని చేనులో బురద నిండింది..

రెండు నెలల పత్తి పంట.. కలుపు, ఎరువులు అన్ని వేసి ఎదిగే దశలో ఉన్న పంటను చూసి సంబరపడ్డా.. మొన్న కురిసిన భారీ వర్షాలు, వరదలతో నా ఆరు ఎకరాల పత్తి పంటలో కొంత కోతకు గురికాగా మరికొంత ఇసుక, మట్టి మేటలు వేసింది. పచ్చని చేను మట్టిదెబ్బలతో ఎర్రగా మారింది. కన్నీరే మిగిలింది. ప్రభుత్వమే ఆదుకోవాలి

– ఠాకూర్ అరుణ్‌సింగ్, నెన్నెల



- ఎదిగే దశలోనే ఎదురుదెబ్బ
- వర్షాలకు నీటమునిగిన పంటలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. వేల ఎకరాల్లో పత్తి, వరి, కూరగాయల పంటలు నీటమునిగి నష్టం వాటిల్లింది. నీటితో నిండిన చేనులు, నేలకొరిగిన మొక్కలు, వరద, బురదతో కూరుకుపోయిన పంటపొలాలు, మట్టి, ఇసుక దిబ్బలతో సారం కోల్పోయిన చేన్ల పరిస్థితి చూసి రైతుల గుండె తరుక్కుపోతోంది. వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పెట్టుబడి కింద రూ.లక్షలు పెట్టి ఇటీవల కలుపు, పంట ఎదుగుదలకు ఎరువులు వేసి.. ఎదుగుతున్న పంటలను చూసి మురిసిపోతున్న రైతన్నకు భారీ వర్షం అశనిపాతమైంది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వ్యవసాయ అధికారుల ప్రాథమిక సర్వేలో ఈ నెల 12నుంచి 18వరకు కురిసిన భారీ వర్షానికి కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి, తాండూర్, నెన్నెల మండలాల్లో 5,306మంది రైతులకు చెందిన 7,868 ఎకరాల్లో పత్తి, వరి, కూరగాయల పంటలు నాటు, ఎదిగే దశలో వరద నీటిలో మునిగినట్లు గుర్తించారు. దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. పలు గ్రామాల్లో నష్టాన్ని గుర్తించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధిక వర్షాలు, వరదలు, వాతావరణ పరిస్థితుల వల్ల 33శాతం నష్టం వాటిల్లిన పంటలకు మాత్రమే పరిహారం అందే వీలుంది. పూర్తి స్థాయిలో నష్టపోయిన పంటలను గుర్తించి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

మండలాల వారీగా పంట నష్టం వివరాలు

మండలం	రైతులు	వరి, పత్తి పంట నష్టం ఎకరాల్లో
భీమిని	729	1,206
తాండూర్	311	668
మందమర్రి	227	848
నెన్నెల	584	510
వేమనపల్లి	900	1,170
కన్నెపల్లి	1,644	2,129
కోటపల్లి	156	120
బెల్లంపల్లి	598	1,036
లక్సెట్టిపేట	48	52
కాసిపేట	11	14
హాజీపూర్	98	115
మొత్తం	5,306	7,868

మూడు రోజులుగా వరదలోనే.

నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట వరద నీటిలో మునిగి ఉంటోంది. మొన్నటి వరకు వర్షాలు లేక ఎదురు చూస్తే ఇప్పుడు ఎడతెరిపి లేని భారీ వర్షాలతో పంట దెబ్బతిని నష్టపోవాల్సి వస్తుంది.

– పోశల వెంకన్న, గ్రామం: అలుగామ, మం: కోటపల్లి



ఐదు ఎకరాలు దెబ్బతింది..

పత్తి, పంట ఎదిగేందుకు కలుపు, ఎరువులు అన్ని వేసిన పంటను చూసి సంబరపడ్డా. ఎడతెరిపి లేని వానలు దెబ్బతీస్తాయని అనుకోలేదు. పంట అంతా ఎండిపోయినట్లు అవుతుంది. ప్రభుత్వమే సాయం అందించాలి.

– కుమ్మరి ప్రశాంత్, కోటపల్లి



రూ.80 వేల నష్టం..



భారీ వర్షాలతో ఎర్రవాగు ఉప్పొంగడంతో వరద చేనులోకి వచ్చి మూడు ఎకరాల పత్తి పంటలో ఇసుక మేటలు వేసింది. ఇప్పటి వరకు రూ.80 వేలు ఖర్చు చేసిన. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కొట్రంగి మనోహర్, గ్రామం: జజ్జరవెల్లి, మం: కన్నెపల్లి

బురదపాలైన పెట్టుబడి..



మూడు ఎకరాల్లో పత్తి సాగుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టిన.. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎదిగే దశలో ఉన్న పత్తి పంట నీట మునిగింది. రెండు ఎకరాలు ఎల్లారం వాగు ఉప్పొంగడంతో బురదలో కూరుకుపోయింది. మట్టి దిబ్బలతో మొక్కలు బురదలో ఉండి మురిగిపోతోంది. పంట నష్ట పరిహారం అందించాలి.

– గద్దల క్రిష్ణ, గ్రామం: జన్కాపూర్, మం: కన్నెపల్లి

జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షం



బృందావన కాలనీలో ఇళ్లు, దుకాణాల్లోకి చేరిన నీరు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 17.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బెల్లంపల్లి మండలంలో 48.8 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 46, మందమర్రిలో 38.5, నస్పూర్‌లో 37.8, హాజీపూర్‌లో 33.3, కన్నెపల్లిలో 33, లక్సెట్టిపేటలో 26.5, కాసిపేటలో 21, తాండూర్‌లో 16.5, జన్నారంలో 14.5, దండేపల్లిలో 12, నెన్నెలలో 11.8, భీమినిలో 9.5, వేమనపల్లిలో 9.3, జైపూర్‌లో 8, చెన్నూర్‌లో 8, కోటపల్లిలో 4.5, భీమారంలో 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'ఎల్లంపల్లి' గేట్లు ఎత్తివేత



గోదావరిలో కలుస్తున్న వరద నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది. ఆదివారం రాత్రి గేట్లు మూసివేసినప్పటికీ అర్ధరాత్రి నుంచి సోమవారం రోజంతా కురిసిన వర్షం, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండడంతో గేట్ల ఎత్తివేత కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.950 టీఎంసీల నీటిమట్టం ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 80వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టులోని 32గేట్లు ఎత్తి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ పథకానికి 295 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్‌హౌస్‌కు 3,200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

న్యూస్‌రీల్

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



నర్సాపూర్ వాగు వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్: వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని బోయపల్లి ఎస్సీ కాలనీ, నర్సాపూర్ భీమన్న వాగు, తాండూర్, కొత్తపల్లి రైల్వే అండర్‌పాస్ పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై స్థానిక అధికారులతో చర్చించారు. రైల్వే అండర్‌పాస్ వద్ద నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుజన సంక్షేమానికి సర్వాయి పాపన్నగౌడ్ పోరాటం

మంచిర్యాలఅగ్రికల్చర్: బహుజన సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ కమార్ దీపక్ అన్నారు. సోమవారం సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని కలెక్టరేట్‌లో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేడు 'గుర్తింపు' ఎన్నికలు జరిగేనా..?

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ(ఓసీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు మంగళవారం జరుగుతాయా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 19న ఎన్నికల తేదీ ఖరారు చేసి షెడ్యూల్ ప్రకటించిన డీసీఎల్ 257మంది కార్మికులతో జాబితా సిద్ధం చేసింది. ఈ నెల 16న ఎన్నికల వాయిదా వేస్తున్నట్లు డీసీఎల్ అర్ధరాత్రి ప్రకటన చేయడాన్ని తప్పు పడుతూ కార్మిక సంఘాలు హైకోర్టును ఆశ్రయించడంతో 19న యధాతథంగా ఎన్నికలు నిర్వహించాలని సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే తొలగించిన తొమ్మిది మంది ఓటర్ల ఓట్లు సీల్డ్ కవర్‌లో ఉంచి కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని, ఎన్నిక మాత్రం నిలిపివేయరాదని స్పష్టం చేసింది. ప్రచారానికి గడువు లేదని, ఎన్నికల నిర్వహణకు సమయం పెంచాలని ఓ యూనియన్ హైకోర్టును సంప్రదించినట్లు సమాచారం.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ



కానిస్టేబుళ్లతో కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సోమవారం ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చారు. 51వ తెలంగాణ ఆర్టీసీ కానిస్టేబుళ్ల రిఫ్రెషర్ కోర్సును బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కానిస్టేబుళ్లు కూడా ప్రతీ రోజు డ్రిల్, క్రమశిక్షణతో ఉద్యోగం చేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకువరావాలని అన్నారు. శిక్షణ అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, సీఐ రవీందర్, ఆర్ఐలు భాస్కర్, సతీశ్, అన్నయ్య, బెటాలియన్ అధికారులు, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న వెంకటయ్య

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, దళితులపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) బాలుర విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. బాలికల విద్యాలయంలో ప్రహరీ నిర్మాణం చేపట్టాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. బూడిదగడ్డ బస్తీలో ఇటీవల కూల్చివేతకు గురైన వినాయక మండప నిర్మాణాన్ని పరిశీలించారు. కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, రాంబాబు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ కృష్ణ, దళిత సంఘాల నాయకులు చిలుక రాజనర్సు, రమేష్, నారాయణ, గోపాల్ పాల్గొన్నారు.

దోస్త్ కావట్లే..!



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సగం సీట్లూ నిండలే..
- ప్రైవేటు కళాశాలల్లోనూ అంతంతే..
- స్పాట్ అడ్మిషన్లకు ఎదురుచూపులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియలో మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తయినా ఆశించిన మేర భర్తీ కాలేదు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఉన్నత విద్యాశాఖ ఇంటర్ తర్వాత డిగ్రీలో చేరే విద్యార్థుల సౌకర్యార్థం దోస్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ) పేరిట ఆన్‌లైన విధానంలో మే 3నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత తప్పిదాల దృష్ట్యా ఉన్నత విద్యామండలి అధికారులు ఈ విద్యాసంవత్సరం దోస్త్‌ను పక్కాగా చేపట్టారు. జిల్లాలో మంచిర్యాల చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లిలో నాలుగు ప్రభుత్వ, 10 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. బీకాం, బీజెడ్సీ, బీఎస్సీ, బీఏ, కంప్యూటర్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ప్రతీ కోర్సులు 60మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. వీటిల్లో 6,368 సీట్ల భర్తీకి గాను 3,261 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తయినా సగం ఖాళీగానే ఉండడంతో చివరి దఫాగా స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రైవేటుకు దీటుగా ప్రచారం

ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు విస్తృత ప్రచారం చేపట్టారు. సౌకర్యాలు, తదితర అంశాలపై విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, స్కాలర్‌షిప్, ఆధునిక ప్రయోగశాలలు, విశాలమైన ఆట మైదానాలు అంటూ కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. అయినప్పటికీ నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో 2,160 సీట్లకు గాను 987మంది అడ్మిషన్లు పొందడం గమనార్హం.

ప్రైవేట్‌కూ తగ్గిన ఆదరణ

ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లోనూ చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. పది కళాశాలలు ఉన్నా మూడు నాలుగింటిల్లో మాత్రమే చేరుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో 300 సీట్లకు గాను 30మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. వంద అడ్మిషన్లు దాటిన కళాశాలల్లో మరో మూడు ఉన్నాయి. మరో కళాశాల ఉన్నా లేనట్లేనని తెలుస్తోంది. కళాశాలలు మూతపడడానికి ఫీజు రీయింబర్స్‌మెంటు కారణంగా తెలుస్తోంది. విపరీతమైన కళాశాలల సంఖ్య పెరగడం, కోర్సులు ఎక్కువగా ఉండడం కూడా కారణమని తెలిసింది. ఇంటర్ తర్వాత విద్యార్థులు ప్రొఫెషనల్ కోర్సుల వైపు ఆసక్తి చూపడంతో డిగ్రీలో ప్రవేశాలు తగ్గుతున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉన్నత చదువుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంజినీరింగ్, బైపీసీ తీసుకున్న వారు ఎంబీబీఎస్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరికకు తల్లిదండ్రులు ఆలోచించడం కూడా డిగ్రీ కోర్సులపై ప్రభావం చూపుతోంది. జ్యోతిబాపూలే, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో వసతి సౌకర్యం ఉండడంతో విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఇవే..

కళాశాల	సీట్లు	ప్రవేశాలు
మంచిర్యాల	360	196
చెన్నూర్	480	221
లక్సెట్టిపేట	660	245
బెల్లంపల్లి	660	327

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రయ్య, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావులతో కలిసి అర్జీలు స్వీకరించారు. కాసిపేట మండలం పెద్దనపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన సఫిరా, అబ్దుల్ బి తాము 59జీవో ప్రకారం భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుని రుసుం చెల్లించామని, పట్టా మంజూరు చేయాలని వేర్వేరుగా దరఖాస్తు అందజేశారు. మంచిర్యాలకు చెందిన దూట లక్ష్మణ్ తాను కొనుగోలు చేసిన భూమికి భూభారతి చట్టం ప్రకారం పట్టా మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ జీరో బిల్లు రావడం లేదని నస్పూర్‌లోని గణేష్‌నగర్‌కు చెందిన బాలసాని అనిత దరఖాస్తు సమర్పించింది.

ఇళ్లకు పరిహారం అందించాలి



గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి పీపీ రావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ చేరి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పంట పొలాలు, ఇళ్లు మునిగి పరిహారం అందక అనేక అవస్థలు పడుతున్నాం. కొందరికి, లీడర్లకు మాత్రమే పరిహారం ఇచ్చి మాకు అన్యాయం చేశారు. మేము ఆ నీటిలో మునిగి చనిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు మా కాలనీకి వచ్చి పరిశీలించి న్యాయం చేయాలి.

– కన్నెపల్లి మండలం సాలిగాం ముంపుకాలనీవాసులు

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి..



రెండేళ్ల క్రితం పక్షవాతం, కాలుకు ఇన్ఫెక్షన్‌తో తొడ భాగం వరకు తొలగించారు. సదరం శిబిరానికి హాజరు కాగా 70శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. వృద్ధాప్య పింఛన్ నుంచి దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలి.

– బల్లెం శంకర్, గ్రామం: కొండపల్లి, మం: హాజీపూర్

వరదల్లో నగరం



హైటెక్‌సిటీ కాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన వరద



ఎంసీహెచ్‌ను చుట్టుముట్టిన వరద నీరు



సూర్యనగర్‌లోని రోడ్డు నంబర్-1 ఇంట్లో నీరు

- లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం
- ఇళ్లలోకి చేరిన నీరు
- ఆందోళనలో ప్రజలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల నగరంలో సోమవారం కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయం అయ్యాయి. టూటౌన్ ప్రాంతంలోని అన్ని కాలనీల్లో రోడ్లు వరద నీటిలో మునిగి, ఇళ్లలోకి వరద నీరు చేరి వస్తువులు తడిసిపోయాయి. హమాలీవాడ డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వరద నీరు రోడ్లపై పారి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరింది. రోడ్లు నీటితో నిండిపోవడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సూర్యనగర్ రోడ్డు నంబరు 2లో డ్రైయినేజీలు సక్రమంగా లేక వరదనీటితో కలిసి మురికి నీరు ఇళ్లలోకి చేరింది. డ్రైయినేజీల్లోని చెత్త తొలగించకపోవడం, దొరగారిపల్లె వెళ్లే రోడ్డుతోపాటు గోపాల్‌వాడ, గాంధీనగర్ నుంచి సూర్యనగర్ రోడ్డు నంబరు3కి వరద నీరు ముంచెత్తుతోంది. హమాలీవాడలోని రోడ్లన్నీ నీటిలో మునిగాయి. ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బృందావనం కాలనీ, చున్నంబట్టి వాడ, తిలక్‌నగర్‌లో రోడ్లు వరదలో మునిగాయి. తిరుమలగిరి కాలనీలోని డ్రైయినేజీ నిండి నీరు ఇళ్లల్లోకి చేరడంతో మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో వరద నీటిని జేసీబీ సహాయంతో దారి మళ్లించారు. హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్లు వరద నీటిలో మునిగిపోయాయి. మాతాశిశు ఆరోగ్య కేంద్రా(ఎంసీహెచ్)న్ని వర్షపు నీరు చుట్టుముట్టింది. బాలింతలు, గర్భిణులు వరద నీటిలో ఆస్పత్రి లోపలికి వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. గత మూడేళ్లుగా ఏటా వర్షాకాలంలో గోదావరి వరద నీటిలో ఎంసీహెచ్ మునిగిపోవడం, అందులోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులను ఐబీ చౌరస్తాలోని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించడం, వర్షాకాలం ముగిసే వరకు ఎంసీహెచ్‌ను మూసే ఉంచడం జరిగింది. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, రాళ్లవాగు ఉప్పొంగడంతో వరద నీటిలో ఎంసీహెచ్ మునిగే ప్రమాదం ఉందని, సిబ్బంది, బాలింతలు, గర్భిణులు ఆందోళన చెందుతున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



హమాలీవాడలో పరిశీలిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు వరద నీటిలో ముంపునకు గురవుతున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి, సహాయక చర్యలు చేపట్టి ముంపు బాధితులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో వరద నీటిలో మునిగిన కాలనీ రోడ్లు, ఇళ్లను పరిశీలించారు. అనంతరం కమిషనర్‌కు ఫోన్ చేసి వరద నీటితో ఇబ్బంది పడుతున్న కాలనీ ప్రజల సమస్యలను వివరించారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, ఇళ్లలోకి చేరిన వరద నీరు, డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్త తొలగించాలని తెలిపారు. వరద తగ్గుముఖం పట్టిన వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలు ఉన్నందున పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీపతి శ్రీనివాస్, అంకం నరేశ్, తోట తిరుపతి, శ్రీరాముల మల్లేశ్, కర్రు శంకర్, జెట్టి చరణ్ పాల్గొన్నారు.

యూరియా కష్టాలు



కోటపల్లిలో గుమిగూడిన రైతులు

కోటపల్లి/తాండూర్: కోటపల్లి, తాండూర్ మండలాల్లో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కోటపల్లి పీఏసీఎస్‌కు 888బస్తాలు, జనగామ ఏఆర్ఎస్‌కేకు 444 బస్తాల యూరియా సరఫరా కాగా రైతులు ఆయా కేంద్రాల వద్ద బారులు తీరారు. తాండూర్ పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందనే విషయం తెలుసుకుని సోమవారం వేకువజామునే రైతులు తరలివచ్చారు. వర్షంలోనూ బారులు తీరారు. వర్షం కారణంగా యూరియా పంపిణీ చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులకు టోకెన్లు జారీ చేశారు. మంగళవారం యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు.


'కడెం' ఆరుగేట్లు ఎత్తివేత



ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం రాత్రి ప్రాజెక్ట్‌కు 42,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్రమత్తమైన అధికారులు ఆరు వరద గేట్లను ఎత్తి 45,887 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 695.225 అడుగుల నీటిమట్టం ఉంది. – కడెం

'గడ్డెన్నవాగు'కు వరద



మూడు గేట్ల ద్వారా దిగువకు వస్తున్న వరదనీరు

భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. సోమవారం ఉదయం వరకు 4,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా మూడు గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సుద్దవాగులో వరదనీటి ప్రవాహా నికి గణేశ్‌నగర్ వద్ద శివాలయం నీట మునిగింది. ఆటోనగర్ వెళ్లే బైపాస్ వంతెన పైనుంచి నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిపేశారు. – భైంసాటౌన్

'స్వర్ణ' రెండు గేట్లు ఎత్తివేత



దిగువకు వెళ్తున్న వరదనీరు

సారంగపూర్ మండలంతో పాటు ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా 6,425 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి 9,205 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 1181.1 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతున్నారు. డీఈ శ్రీనివాస్, ఏఈ వేణుగోపాల్ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. – సారంగపూర్

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1089.2 అడుగుల (74.128 టీఎంసీలు) నీటి నిల్వ ఉంది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 1.25 లక్షల క్యూసెక్కుల వరద నీరు కొనసాగడంతో 34 గేట్లను ఎత్తి 1.25 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వరద కాలువకు 18 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. – మామడ

క్లుప్తంగా

ఒకరిపై పోక్సో కేసు



నిందితుడితో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండల కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద హమాలీగా పనిచేస్తున్న కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన పోగుల సురేశ్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాఠశాల ఉపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

అనుమానితునిపై..

ఇంద్రవెల్లి: మండలంలోని పిప్రి, మల్లాపూర్ గ్రామాల్లో టీ ఫైబర్ వైపై బ్యాటరీలు చోరీ చేసిన ఘటనలో సోమవారం ఓ అనుమానితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ సాయన్న తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరు బ్యాటరీలు దొంగలు ఎత్తుకెళ్లారని టీ ఫైబర్ ఫీల్డ్ ఇంజనీర్ చిట్యాల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితుడు గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ధన్‌రాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలరూరల్: పట్టణంలోని రెండవ జోన్ ఏరియా చిన్న మజీద్ ప్రాంతానికి చెందిన కీర్తి శ్రావణి సోమవారం ఉదయం మంచిర్యాలలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి కుమారుడు అనిరుద్‌తో కలిసి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి కీర్తి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

దాడి కేసులో ఒకరికి జరిమానా

నిర్మల్‌టౌన్: యువకుడిపై దాడి చేసిన ఒకరికి రూ.13,500 జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి శ్రీవాణి సోమవారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015లో మామడ మండలం తాండ్రకు చెందిన జ్యోతిసింగ్ తోటలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆవులు మేపాడు. దీంతో జ్యోతి సింగ్ అతనితో జరిగిన గొడవలో అతని కుమారుడిని గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మామడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, చార్జ్‌షీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

విద్యుత్ తీగ తెగిపడి ఎద్దు మృతి

చెన్నూర్: పట్టణంలోని మహంకాళివాడలో మానిశెట్టి రమేశ్‌కు చెందిన ఎద్దు సోమవారం సా యంత్రం పశువులకొట్టంలో కట్టివేసేందుకు తీసుకెళ్తుండగా ప్రధాన రహదారిలో గల మెయిన్ విద్యుత్‌వైరు తెగి మీదపడడంతో షాక్‌కు గురై మృతి చెందింది. వెనుకనే ఉన్న రమేశ్ తీగను గమనించి అక్కడే ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని, జిల్లా అధికారులు స్పందించి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రహదారిలో విద్యుత్ వైర్ తెగిపడడంతో కాలనీ వాసులతో పాటు బాటసారులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ వైర్ తెగిపోయిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

అనారోగ్యంతో ఒకరు..

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా ఏరోడ్ జంక్షన్ టూ కోర్బకొచ్చి వెళ్లి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ధన్పత్‌లాల్ యాదవ్ (35) అనారోగ్యంతో మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పత్రాపార్టి గ్రామానికి చెందిన లాల్‌యాదవ్ తమిళనాడులోని బోర్‌వెల్ బండిపై పని చేసేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తనకు దగ్గరి బంధువు రాంప్రసాద్ యాదవ్ ఇంటికి తీసుకెళ్తుండగా మంచిర్యాల సమీపంలోకి రాగానే మృతి చెందాడు.

లారీ బోల్తా

తాండూర్: కందిపప్పు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏపీ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు కందిపప్పు లోడుతో వెళ్తున్న లారీ తాండూర్ పెట్రోల్‌బంక్ సమీపంలో ఆదివారం రాత్రి బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. నేషనల్ హైవే అథారిటీ సిబ్బందికి అక్కడికి చేరుకొని లారీని బయటకు తీసే చర్యలు చేపట్టారు.

గుండేగాంలోకి మళ్లీ నీళ్లు..

- గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ జానకీ షర్మిల



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసా/భైంసారూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుండేగాం వాసుల్లో మళ్లీ భయం పట్టుకుంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గుండేగాం వంతెన నీట మునిగింది. వంతెనతోపాటు గ్రామాన్ని సోమవారం ఎస్పీ జానకీ షర్మిల సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి ఏ అవసరం వచ్చినా మేమున్నామని భరోసా కల్పించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు రానున్నారు. మంత్రి ఈ సమస్యకు పరిష్కారం చూపుతారన్న ఆశ గ్రామస్తుల్లో నెలకొంది.

సర్వే పూర్తయినా...

గత ప్రభుత్వహయాంలో గుండేగాం పునరావాసం సర్వే పూర్తి చేశారు. రూ.200 కోట్లకుపైగా నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. భైంసా మండలం సిద్దూర్ శివారుల్లో సర్వేనంబర్ 73లో మూడెకరాల భూమి గుర్తించి అందులో పునరావాసం కల్పిస్తామన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల స్థలాలకు సంబంధించిన నమూనాలు పూర్తికాలేదు. గత ప్రభుత్వహయాంలో పునరావాసం కోసం రూ.66 కోట్లు అవసరమని మరో ప్రతిపాదన పంపించారు. ఈ నిధులు సరిపోవంటూ మరో రూ.33 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. ఇలా పలుమార్లు ఇచ్చిన నివేదికలన్నీ ప్రభుత్వం వద్దే మగ్గుతున్నాయి. ఫలితంగా ఏటా వానాకాలం ఈ గ్రామానికి గండంగా మారుతోంది. వర్షాలు కురిస్తే నీరంతా గ్రామంలోకి వచ్చి చేరుతోంది.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోనే...

రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలతో రెవెన్యూ అధికారులు కమలాపూర్ గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనే ఇప్పటికీ గుండేగాం వాసులు ఉంటున్నారు. ప్రతీరోజు అక్కడి పంట పొలాల్లో పనిచేసుకుని సాయంత్రానికి ఇక్కడికే తిరిగివస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

వాడి గ్రామ సమీపంలో సుద్దవాగుపై 2005లో రూ.12కోట్ల వ్యయంతో రంగారావు పల్సికర్ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 12 గ్రామాలకు చెందిన 4,600 ఎకరాలకు సాగునీరందించేలా పనులు చేపట్టారు. కోతల్‌గాం, బిజ్జూర్, ఎగ్గాం, మాటేగాం, హంపోలి, బోరిగాం, వాడి, బాబుల్‌గాం, భైంసా, హజ్గుల్, వానల్‌పాడ్, వాటోలి గ్రామాలకు చెందిన 1800 మంది రైతుల సాగు భూములకు నీరందేలా కాలువలు తవ్వారు. 2006లో ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు అర్ధాంతరంగా వదిలేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రాజెక్టు నిర్మాణ నిధులు రూ.25 కోట్లకు పెంచి పనులు ప్రారంభించారు. 2006 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టు పనులు పూర్తికాక అటు పునరావాసం కల్పించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు ప్రాజెక్టు కింద తవ్విన కాలువలన్నీ కూరుకుపోయాయి.

ఇబ్బంది పడుతున్నాం

వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నాం. వర్షం కురిస్తే నీళ్లన్నీ గ్రామంలోకి వస్తున్నాయి. వాగు పక్కన నిలిచిన నీరంతా శ్మశాన వాటికను ముంచేస్తోంది.

– అంశబాయి, గ్రామస్తురాలు

పునరావాసం కల్పించాలి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుండేగాం వాగు పక్కన నీరు నిలిచిపోయింది. ఎటు చూసినా నీరే ఉంది. అధికారులు గుండేగాం వాసులకు పునరావాసం కల్పించాలి.

– సురేశ్, గ్రామస్తుడు

'పోడు' రైతులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్సీ దండె విఠల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: ప్రజా ప్రభుత్వంలో పోడు రైతులకు న్యాయం చేస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల ఉచ్చులో పాడి పోడు రైతులు కేసుల పాలు కావొద్దన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఎంపీ ఎన్నికల ప్రచారంలో గోడం నగేశ్‌ను గెలిపిస్తే గిరిజనేతర రైతులకు పోడు పట్టాల పంపిణీ చట్టం చేస్తామని ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పోడు వ్యవసాయం కేంద్రం పరిధిలో ఉందని, బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు పోడు పట్టాల పంపిణీ చట్టంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులకు ఐదెకరాలకంటే ఎక్కువ పోడు సాగు ఉదని అటవీశాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, పార్టీ మండల కన్వీనర్లు నికోడే గంగారాం, ఉమా మహేశ్, నాయకులు సీతల్, విఠల్, పోశం, శంకర్, రవి, లహాను, తదితరులు పాల్గొన్నారు.

నిధి తీస్తానని మోసగించిన వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

లోకేశ్వరం: మీ ఇంట్లో నుంచి నిధిని బయటకు తీస్తానని నమ్మించి మోసగించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ముధోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన బాయి భోజక్క ఇంటికి ఈ నెల 12న సిరిసిల్ల జిల్లాలోని పెద్దూర్ గ్రామానికి చెందిన రాజేశ్వర్, శ్రీకాంత్ కారులో వచ్చారు. మీఇంట్లో బంగారు నిధి ఉందని, పూజలు చేసి బయటకు తీస్తామని, ఇందుకు రూ.22 వేలు అవుతుందని ఒప్పందం కుదుర్చుకుని వెళ్లిపోయారు. మళ్లీ 13న రాజేశ్వర్ వచ్చి ముందుగా రూ.10 వేలు ఇవ్వమని తీసుకున్నాడు. అనంతరం సదరు మహిళ ఇంట్లో కొత్తకుండను పెట్టి ఇందులో రెండు తులాల బంగారం వేయాలని చెప్పడంతో తులం చైన్, తులం ఉంగరం ఇచ్చింది. వాటిని కుండలో వేసినట్లు నమ్మించాడు. పూజలు చేసి రెండు రోజుల తర్వాత వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. రెండు రోజుల తరువాత మళ్లీ ఫోన్‌చేసి పూజ పూర్తి చేసి నిధి బయటకు తీయాలంటే దాదాపు రూ.3 లక్షలు అవుతుందని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు కుండను తెరిచి చూడగా అందులో బంగారం లేకపోయేసరికి లబోదిబోమన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాజేశ్వర్ భోజక్క ఇంటికి రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న ఉంగరం, చైన్‌తో పాటు కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఎస్సై అశోక్‌ను సీఐ అభినందించారు.

అనారోగ్యంతో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మృతి



ప్రవీణరెడ్డి (ఫైల్)

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మర్రి ప్రవీణరెడ్డి (71) అనారోగ్యంతో మృతి చెందింది. 2000 సంవత్సరంలో టీడీపీ నుంచి దండేపల్లి జెడ్పీటీసీగా గెలుపొందిన ఆమె 2005 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. అంతేకాకుండా సుమారు 40 ఏళ్ల నుంచి మేదరిపేటలో ప్రైవేట్ నర్సింగ్‌హోం నిర్వహిస్తున్నారు. ఏడాది క్రితం క్యాన్సర్ బారిన పడింది. నెల రోజులుగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది.

జాతీయస్థాయి వర్క్‌షాప్‌కు జిల్లా ఉపాధ్యాయుడు

నిర్మల్‌ఖిల్లా: నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి పదిమంది ఉపాధ్యాయులకు స్థానం దక్కగా అందులో నిర్మల్ జిల్లా భైంసా మండలం వానల్‌పాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మేదరి ఎల్లన్నకు అవకాశం లభించింది. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్ ఉత్తర్వులు వెలువరించారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన ఒకరి అరెస్టు

బోథ్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయకులను మోసగించి డబ్బులు వసూలు చేసిన మామిడాల సతీశ్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయిలు తెలిపారు. కరీంనగర్ జిల్లాకు చెందిన సతీశ్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.5.50 లక్షలు వసూలు చేశాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న నలుగురు..

సాత్నాల: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం భోరజ్ మండలం గిమ్మ గ్రామంలో దాడులు నిర్వహించగా పేకాడుతున్న మండ అడెల్లు, మాదాస్తు పవన్, మునిగల భూమన్న, గడసందుల భూమయ్యను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి రూ.6,600 నగదు, రెండు ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రవి

బెల్లంపల్లిరూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బెల్లంపల్లికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ విజ్జగిరి రవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ నెల 17న బెంగళూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో పాల్గొని బ్లాక్ బెల్ట్ సిక్సత్ డాన్ కైవసం చేసుకున్నాడు. కెన్ భూకాయ్ కరాటే ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ విజయం, తెలంగాణ కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు



ట్రోఫీతో నిజామాబాద్ క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 16 నుంచి జరుగుతున్న 5వ రాష్ట్ర బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. పురుషుల విభాగంలో సంయుక్త విజేతలుగా హైదరాబాద్, రంగారెడ్డి జట్లు, తృతీయస్థానంలో నిజామాబాద్ జట్టు నిలిచింది. మహిళల విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్ జట్లు సంయుక్త విజేతలుగా తృతీయస్థానంలో నల్గొండ జట్టు నిలిచింది. విజేతలకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్. కృష్ణ, జిల్లా అధ్యక్షుడు కళాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఒకరు అరెస్టు

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన షేక్ మహ్మద్ అలీని బెదిరించిన కేసులో పాండురంగ్ అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. 2023లో మండల కేంద్రంలో సిరిచెల్మ చౌరస్తాలో జరిగిన మర్డర్ కేసులో మహ్మద్ అలీ ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడని, కోర్టులో సాక్ష్యం చెప్తే చంపేస్తానని ఈ నెల 17న బెదిరించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచార నిందితుడి అరెస్ట్

కైలాస్‌నగర్: మద్యంమత్తులో వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన మడావి నగేష్ అలియాస్ నాగోరావు, అలియాస్ నాగేశ్వర్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 8న రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో మద్యం సేవించి వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్రలోని 40 పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలించామన్నారు. సోమవారం మధ్యాహ్నం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరానికి పాల్పడినట్లుగా అంగీకరించాడన్నారు. మూడేళ్ల క్రితం భార్య నుంచి విడిపోయి కూలి పని చేసుకుంటూ ఆదిలాబాద్‌లో నివాసం ఉంటున్నాడన్నారు. నిందితునిపై హత్యాయత్నం, అత్యాచారం, దోపిడీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ సునీల్ కుమార్, ఏఎస్సై కైసర్, కానిస్టేబుల్ అశోక్, కరీం, రుక్మారెడ్డి, హనుమంతులను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

ఛాయాచిత్రం.. స్మృతుల సజీవ సాక్ష్యం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ర్యాలీ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

- మధుర స్మృతులు.. కలకాలం పదిలం..
- ఫొటోలు శాశ్వతం... గతం తీపి గుర్తుల జ్ఞాపకం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఫొటోగ్రఫీ ప్రకృతి అందాలు, పసిపాపల నవ్వులు, జీవితంలోని ప్రతీ మలుపును శాశ్వతంగా నిలిపే కళ. నలుపు–తెలుపు యుగం నుంచి డిజిటల్ కాలం వరకు, ఫొటోలు భావాలకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. ప్రకృతి సౌందర్యం, శుభకార్యాలు, ప్రళయాలు, విధ్వంసాలు అన్నింటినీ ఒడిసిపట్టే ఛాయాచిత్రాలు సామాజిక మార్పులకు ఆధారం. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈ కళ గురించి ప్రత్యేక కథనం.

ఫొటోగ్రఫీ పుట్టుక

'ఫోటోస్' (కాంతి), 'గ్రాఫ్' (రాయడం) అనే గ్రీకు పదాల నుంచి ఫొటోగ్రఫీ ఉద్భవించింది. 1839లో ఫ్రాన్స్‌కు చెందిన ఎల్.జె.ఎం.డ్యాగురే తొలి ఛాయాచిత్రాన్ని సెన్సార్ అయోడైజ్డ్ ద్వారా బంధించగా, ఫ్రాన్స్ సైన్స్ అకాడమీ ఆగస్టు 19ను ప్రపంచ ఫొటోగ్రఫీ దినంగా ప్రకటించింది. 1889లో జార్జ్ ఈస్ట్‌మన్ కొడాక్ బాక్స్ కెమెరాను రూపొందించాడు. మాన్యువల్ నుంచి డిజిటల్ కెమెరాల వరకు, ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ సెల్ఫీలు ఫొటోగ్రఫీని మార్చేశాయి.

సాంకేతిక మార్పులు


తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం, ఆల్ ఇండియా ఫొటో ఇండస్ట్రీ వంటి సంస్థలు ఎగ్జిబిషన్‌ల ద్వారా డిజిటల్ కెమెరాలు, ప్రింటర్లను పరిచయం చేస్తూ శిక్షణ ఇస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఛాయాచిత్ర పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు విప్లవం సృష్టిస్తుండగా, స్టూడియోల గిరాకీ తగ్గింది.

భరోసా కల్పిస్తున్నాం



మాన్యువల్ కెమెరాల స్థానంలో డిజిటల్ కెమెరాల రాకతో చాలావరకు ప్రత్యేకత తగ్గింది. లేటెస్ట్ ఆండ్రాయిడ్, స్మార్ట్ ఫోన్లు రావడంతో ఫొటోలు, సెల్ఫీలతో సెల్‌ఫోన్ ప్రింట్లు పెరిగాయి. ప్రొఫెషనల్ ఫొటో కెమెరాలతో కాకుండా సెల్ ఫొటోలపై మోజు పెంచుకుంటున్నారు. లక్షలు వెచ్చించి కొన్న కెమెరాలతో షూటింగులకు వెళ్లిన ప్రతీచోట సెల్‌ఫోన్‌లు ఇచ్చి ఫొటోలు తీయమంటున్న సందర్భాల్లో బాధగా ఉంటోంది. సంక్షేమ సంఘం ద్వారా కుటుంబ భరోసాతో అండగా నిలుస్తున్నాం.

– అప్పాసు రాము, ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల





ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



అనక జంగు ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి మండలంలోని ముత్నూర్ సమీపంలో గల త్రివేణి సంగమం చెరువు, కోతకు గురైన ప్రధాన రహదారిని పరిశీలించారు. అనంతరం పిట్టబొంగరం గ్రామంలో ఈదురు గాలులతో ఇంటి పైకప్పు కొట్టుకుపోయిన అనక జంగు కుటుంబాన్ని పరామర్శించారు. దస్నాపూర్, వడగామ్, హీరాపూర్, అంజీ తదితర గ్రామాల్లో పర్యటించి కోతకు గురైన రోడ్లు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి జహీర్, నాయకులు ఎండీ మసుద్, మీర్జా యాకూబ్‌బేగ్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం రాజుగూడకు చెందిన రాథోడ్ వికాస్ ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని, మందమర్రికి చెందిన అమృత ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని, ఉట్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన ఆత్రం అయ్యుబాయి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని, జైనూర్ మండలం శివనూర్‌కు చెందిన ధనుష్ గురుకుల కళాశాలలో అడ్మిషన్ ఇప్పించాలని కోరారు. ఇంకా పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు.